హుస్సేన్‌సాగర్ నాలా బ్రిడ్జిపై
కూలిన వర్టికల్ గార్డెన్

- ఎవరూ లేకపోవడంతో తప్పిన పెనుప్రమాదం
- వ్యర్థాలను, ఐరన్‌ను తొలగించిన జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది


నల్లకుంట బ్రిడ్జి వద్ద కూలిపోయిన వర్టికల్ గార్డెన్ ఐరన్ జాలీ


బ్రిడ్జిపై పార్కింగ్ చేసిన ఆటోట్రాలీపై కూలిన ఐరన్ జాలీ

నల్లకుంట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా సమీపంలోని హుస్సేన్‌సాగర్ నాలా బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన వర్టికల్ గార్డెన్ బుధవారం మధ్యాహ్నం కూలిపోయింది. నిత్యం వందలాది వాహనాలు సాగించే ఈ బ్రిడ్జిపై ఆ సమయంలో రాకపోకలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. వర్టికల్ గార్డెన్ కూలడంతో కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వెంటనే రత్నానగర్‌కు చెందిన ప్రజలు జీహెచ్ఎంసీ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అరగంటలోపే ట్రాన్స్‌కో, ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది వచ్చి, కూలిన స్టీల్‌రాడ్స్, చెట్టు కొమ్మను తరలించారు.

ఒక వైపే కూలింది..

నల్లకుంట డివిజన్ రత్నానగర్, శివానందనగర్‌ను అనుకుని ప్రవహిస్తున్న హుస్సేన్‌సాగర్ నాలా బ్రిడ్జిపై ఇరువైపులా ఏర్పాటు చేసిన వర్టికల్ గార్డెన్ ఓ వైపు కూలిపోయింది. మధ్యాహ్నం కూలిపోయింది. ఈ వర్టికల్‌పై ఇటీవల మొక్కలను జీహెచ్ఎంసీ హార్టికల్చర్ సిబ్బంది ఏర్పాటు చేశారు. అయితే ఈ వర్టికల్ గార్డెన్‌కు స్టీల్ రాడ్‌లకు సరైన రక్షణ ఏర్పాటు చేయలేదు.


కూలిపోయిన వర్టికల్ గార్డెన్ స్టీల్ రాడ్‌లు, చెట్ల కొమ్మలను తరలిస్తున్న అధికారులు, సిబ్బంది

రత్నానగర్ హుస్సేన్‌సాగర్ నాలా బ్రిడ్జిపై..

నల్లకుంట డివిజన్ రత్నానగర్ సమీపంలోని హుస్సేన్‌సాగర్ నాలా బ్రిడ్జిపై పాదచారులు మూత్ర విసర్జన చేస్తుండడంతో తీవ్ర దుర్వాసన నెలకొంది. దీంతో ఆ బస్తీవాసుల విజ్ఞప్తి మేరకు ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం వర్టికల్ గార్డెన్‌ను లక్షలాది రూపాయల వ్యయంతో గత ప్రభుత్వ హయాంలో నిర్మించారు. వర్టికల్ గార్డెన్‌లో వివిధ రకాల పూలమొక్కలతోపాటు దర్శనీయ స్థలాల త్రీడీఎఫెక్ట్‌తో తీర్చిదిద్దారు. అంతేకాకుండా బ్రిడ్జిపై వాయు కాలుష్య తీవ్రత తగ్గేందుకు ఏర్పాటు చేశారు. ఈ గార్డెన్ రాత్రివేళ ఈ బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులకు ఎంతో ఆహ్లాదం ఇస్తుంది.

వర్టికల్ గార్డెన్ రక్షణకు చర్యలు తీసుకోవాలి

కాలుష్యరహితంగా తీర్చిదిద్ది ఉదయం, సాయంత్రం వేళల్లో బ్రిడ్జిలపై ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు కోసం ఏర్పాటు చేసిన వర్టికల్ గార్డెన్‌లకు జీహెచ్ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు సరైన రక్షణలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై లక్షలాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ వర్టికల్ గార్డెన్‌లకు రక్షణ చర్యలు విస్మరించడం శోచనీయమని అన్నారు. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటుపై హర్షిస్తున్న వారు అదే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటే మరింత బావుంటుందని పలువురు కోరుతున్నారు.


నల్లకుంటలో కరాటే విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ యాకర అమృత తదితరులు

ఆత్మరక్షణకు కరాటే దోహదం : ఎమ్మెల్యే కాలేరు

నల్లకుంట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని, విద్యార్థులు విద్యతోపాటు కరాటే శిక్షణపై దృష్టి సారించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత పేర్కొన్నారు. నల్లకుంట డివిజన్ ఇందిరానగర్‌లో ఓ ప్రైవేట్ హైస్కూల్ విద్యార్థులు ఇటీవల ఖమ్మంలో జరిగిన కరాటే టోర్నమెంట్‌లో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. ఈ పోటీల్లో విజేతలకు బుధవారం ఎమ్మెల్యే, కార్పొరేటర్ సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందించారు.

హక్కుల సాధనకు రాజీలేని పోరాటం

నల్లకుంట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటం చేస్తామని నేషనల్ అంబేడ్కర్ సేన జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు అన్నారు. బుధవారం సేన నగరంలోని కార్యాలయంలో నేషనల్ అంబేడ్కర్ సేన తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా గుమ్మల కమల్‌కుమార్‌ను ఆయన ప్రకటించి, నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పూర్తిస్థాయిలో నూతన కమిటీలను ఏర్పాటుచేస్తామని, తద్వారా దేశంలో సేన బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ అంబేడ్కర్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తాలుకా రాజేష్, ఉపాధ్యక్షుడు గోకుల్ కల్యాణ్‌రావు, నాయకులు ప్రవీణ్, దాసరి విశాల్, జయకుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాగ్‌అంబర్‌పేటలో పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు

నల్లకుంట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి పేర్కొన్నారు. బుధవారం డివిజన్‌లోని మల్లికార్జున్‌నగర్‌లో పారిశుధ్య సిబ్బంది చెత్త, మట్టికుప్పలను ఎత్తివేయడాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా చెత్త, చెదారం, మట్టికుప్పలను ఎత్తివేసి, తరలిస్తున్నామన్నారు.


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి

కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

బర్కత్‌పుర, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసింది. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.చిరంజీవి ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పాఠ్యపుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్థం కాని పాఠ్యాంశాల విషయంలో అనుభవం గల అధ్యాపకుల ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఇంటర్ విద్యా వ్యవస్థ భావి భవిష్యత్‌కు పునాది వంటిదన్నారు. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే కష్టపడి చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసరావు, గీతాబాయ్, వి.ప్రసాదరావు, రామ్మోహన్, అనిల్‌రెడ్డి, నర్సిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ బి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్లకు మరమ్మతులు

బర్కత్‌పుర, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో వర్షాకాలం నేపథ్యంలో డ్రైనేజీ పైప్‌లైన్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. బుధవారం డివిజన్‌లోని టూరిస్ట్ హోటల్ సమీపంలో డ్రైనేజీ లీకేజీ అయి మురికినీరు రోడ్డుపై పారుతోంది. దీంతో స్థానికుల ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతానికి వెళ్లి జీహెచ్ఎంసీ సిబ్బంది ద్వారా మరమ్మతు పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ భావన, మేనేజర్ వెంకటేష్‌యాదవ్, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు అర్జున్, వినోద్, విజయ్, భీమ్‌రాజ్, సూరి పాల్గొన్నారు.

మోదీ 11 ఏళ్ల పాలనలో అభివృద్ధి పథంలో దేశం

రాంనగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలనలో అన్ని రంగాల్లో దేశం అభివృద్ధి, సంక్షేమం వైపు దూసుకెళ్తుందని అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ పేర్కొన్నారు. బీజేపీ అధిష్ఠానం పిలుపులో భాగంగా బుధవారం రాంనగర్ గుండూ చౌరస్తాలో బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప సభ జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రామ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శేషసాయి, డివిజన్ అభియాన్ కన్వీనర్ శ్యామ్, నాయకులు కౌండిన్యప్రసాద్, కృష్ణశాస్త్రి, ఎం.సి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.


సామూహిక అక్షరాస్యతను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రవిచారి

అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించండి

రాంనగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను పంపించాలని రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి సూచించారు. సికింద్రాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ముషీరాబాద్ సెక్టార్ రాంనగర్ డివిజన్ అంబేడ్కర్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం బడిబాట, సామూహిక అక్షరాస్యత కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, సిబ్బంది బస్తీవాసులు పాల్గొన్నారు.


పిగిలం వెంకట కిషోర్‌కుమార్‌యాదవ్‌ను సన్మానిస్తున్న అతిథులు

వెంకట కిషోర్‌కుమార్ యాదవ్‌కు సన్మానం

చిక్కడపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రక్తదాత, ప్రముఖ సంఘసేవకుడు పిగిలం వెంకట కిషోర్‌కుమార్ యాదవ్‌ను సన్మానించారు. ఆయన సేవలను గుర్తించి తమిళనాడు రాష్ట్రంలోని హోసూరునందు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయనను ఘనంగా సన్మానించారు. పినాకిని సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రచయిత మురళీమోహన్‌రాజు, లయన్ డా.రామచంద్రరావు, ఆనందయ్య, రియాజ్‌బాషా, చెన్నయ్య, రమణ, శశిధర్, సత్యనారాయణ, రమణమ్మ, రవి తదితరులు పాల్గొన్నారు.

21న యోగా కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలి

చిక్కడపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగా కార్యక్రమంలో పాల్గొనాలని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ ప్రాంగణంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వి. నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని ముందస్తుగా బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వినయ్‌కుమార్ బీజేపీ నాయకులతో కలిసి యోగాసనాలు వేశారు. వినయ్‌కుమార్ మాట్లాడుతూ భారతప్రభుత్వం ఆధ్వర్యంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పర్యవేక్షణలో ఈనెల 21న ఎల్‌బీ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇందులో గాంధీనగర్ డివిజన్ నుంచి సీనియర్ సిటిజన్‌లు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, దామోదర్, వీఎస్టీ రాజు, సత్తిరెడ్డి, పాల శ్రీను, ప్రకాష్‌యాదవ్, సత్యేందర్, యాదగిరి, నీరజ్, సంయుక్తరాణి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెక్కుల బౌన్స్‌పై చర్యలు తీసుకోవాలి: డీఎంసీ



అంబర్‌పేట సర్కిల్ పరిధిలో ఆస్తిపన్ను చెల్లింపు కోసం చెక్కులు ఇచ్చి బౌన్స్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, డబ్బులు వసూలు చేయాలని డీఎంసీ మారుతిదివాకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం జరిగిన ట్యాక్స్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చెల్లించని వారి ఆస్తులను సీజ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ బి.రవీందర్, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- రాంనగర్, ఆంధ్రజ్యోతి

మంత్రి వివేక్‌కు సత్కారం


రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన జి.వివేక్ వెంకటస్వామిని బుధవారం తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.వైద్యనాథ్, కార్యదర్శి ఎస్.సంతోష్‌కుమార్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

తుల్జాభవానీ అమ్మవారికి పూజలు



రాంనగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని తుల్జాపూర్‌లో గల తుల్జాభవానీ అమ్మవారి ఆలయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి జి.నాగభూషణం, ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ బుధవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి


దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని హైదరాబాద్ కలెక్టర్ హరిచందనను అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, నాయకులు శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు బుధవారం వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.
- రాంనగర్, ఆంధ్రజ్యోతి

గోశాలలో కోడెల మృతిపై మంత్రి చర్యలు తీసుకోవాలి

రాంనగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరి దేవాలయానికి చెందిన గోశాలలో చనిపోతున్న కోడెల మృతిపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చర్యలు తీసుకోవాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కోడెల మృతి రాజన్న భక్తులకు తీవ్ర మనోవేదనకు గురిచేస్తుందన్నారు. కోడెల సంరక్షణలో దేవాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం తగదన్నారు. గోశాల నిర్వహణకు నిధులు కేటాయించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

20న ఆర్టీసీ డయల్ యువర్ ఆర్ఎం


ఆర్టీసీ ఆర్ఎం సుధా పరిమళ

బర్కత్‌పుర, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ రీజియన్ పరిధిలో ప్రయాణికులకు ఆర్టీసీ మరింత చేరువయ్యేందుకు ఈ నెల 20న డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ హైదరాబాద్ రీజినల్ మేనేజర్ సుధాపరిమళ తెలిపారు. రీజియన్ పరిధిలో 14 ఆర్టీసీ డిపోల ద్వారా నిత్యం 1,514 బస్సుల ద్వారా 13-14 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. దీనిలో 9-31 లక్షల మంది మహిళా ప్రయాణికులు ఉన్నారని ఆమె తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 20న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకుని తగు సూచనలు, సలహాలతోపాటు ఏదైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని ఆమె కోరారు. ప్రయాణికులు 8885719194 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూన్18 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని సీబీడీ ఏడీఈలు తెలిపారు. నారాయణగూడ, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఆదర్శనగర్ 11కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1, చిక్కడపల్లి, ఆర్‌వోఎం, గాంధీనగర్, క్షత్రియాహోటల్ పరిధిలో 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌సరఫరా ఉండదన్నారు.

నేడు కిషన్‌కు పురస్కారం ప్రదానం

చిక్కడపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శ్రీకిరణ్ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో సంఘసేవకురాలు ఏకాపద్మ పురస్కారాన్ని ప్రముఖ హార్ట్ వైద్యనిపుణులు ముదావత్ కిషన్‌కు ప్రదానం చేయనున్నారు. గురువారం సాయంత్రం త్యాగరాయగాన సభలో జరిగే కార్యక్రమంలో వైద్య నిపుణుడు డా.పల్లంకి సత్యదత్తాత్రేయ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్ తరలింపు

చిక్కడపల్లి: చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్‌ను తరలించనున్నారు. నారాయణగూడ మెట్రో పిల్లర్ 1177 వద్దనున్న భవనంలోకి చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్‌ను మార్చనున్నారు. మరో రెండుమూడు రోజుల్లో పీఎస్‌ను తరలిస్తామని ఇన్‌స్పెక్టర్ వీరేశం తెలిపారు. కాగా ప్రస్తుతం చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్ ఉన్న భవనంలోకి నూతనంగా ఏర్పాటైన గాంధీనగర్ ట్రాఫిక్ పీఎస్‌ను ఏర్పాటు చేయనున్నారు.

పీఎస్ తరలింపుపై విస్మయం

చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో ఉన్న నూతనంగా నిర్మించిన భవనంలోని చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్‌ను ఇక్కడి నుంచి తరలించడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. చిక్కడపల్లి, ముషీరాబాద్ ప్రాంతాలకు ఏమాత్రం సంబంధం లేని గాంధీనగర్ ట్రాఫిక్‌పీఎస్‌ను గోల్కొండ చౌరస్తాలో ప్రస్తుతం ఉన్న చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్ భవనంలోకి మార్చడాన్ని కూడా పలువురు విమర్శిస్తున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ముషీరాబాద్: వర్షాకాలం మొదలవ్వగానే సీజనల్‌వ్యాధులు వస్తాయని వీటిపట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని బోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆసుపత్రిలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన మాట్లాడుతూ... సీజనల్ వ్యాధుల్లో అధికంగా మలేరియా, డెంగీ, టైఫాయిడ్, జలుబు, జ్వరం, దగ్గు, ఇన్‌ఫెక్షన్‌లు అధికంగా వస్తాయని పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ ఫెల్లిస్, ఆసుపత్రి ఏఎన్ఎంలు విజయకుమారి, సునీత, సంతోషిణి, పద్మలత, రేణుక, రజిత తదితరులు పాల్గొన్నారు.


ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్‌కు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ సెక్రటరీస్ సెంట్రల్ ఫోరం హైదరాబాద్ అధ్యక్షుడు బలరామ్, వెంకటరమణ

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

రాంనగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పంచాయతీలో పనిచేస్తున్న కార్యదర్శుల దీర్ఘకాలిక, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ సెంట్రల్ ఫోరం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ సెంట్రల్ ఫోరం హైదరాబాద్ అధ్యక్షుడు సందిళ్ల బలరామ్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ గ్రేడింగ్, తద్వారా పంచాయతీ కార్యదర్శుల క్యాడర్ స్ట్రెంత్ నిర్ధారణ చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్రంలో ఓపీఎస్‌లుగా పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులను జేపీఎస్‌లుగా కన్వర్ట్ చేయాలన్నారు. ఓపీఎస్‌లుగా నాలుగు సంవత్సరాల సర్వీసు ఉన్న వారికి గ్రేడ్ 4గా నియమించాలని కోరారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నాలుగు సంవత్సరాల విధి నిర్వహణ కాలాన్ని సర్వీసుగా పరిగణిస్తూ ప్రొబెషన్ డిక్లేర్ చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలలోపు పంచాయతీ కార్యదర్శుల గ్రేడ్‌ల వారీగా సీనియారిటీ జాబితాను చేసి ప్రస్తుతం ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలకు సంబంధించి తమవద్ద పెండింగ్‌లో గల నోషనల్ ప్రమోషన్ల ఫైళ్లను పరిశీలించి, ప్రమోషన్లు కల్పించాలని కోరారు. తమ డిమాండ్లను పరిశీలించి, చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, గోదారాజు, వేమారెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

